క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపిక


పూజ

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9 తరగతి విద్యార్థిని ఎస్.పూజ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి(అండర్-14) పోటీలకు ఎంపికయినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మణి తెలిపారు. పూతల పట్టులో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర పోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి గుంటూరు జిల్లా పెద్ద కాకాని మండలంలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. బాలికను పాఠశాల హెచ్ఎం డి.మురళీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కాలభైరవ క్షేత్రంలో అష్టమి పూజలు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో వెలసియున్న శ్రీకాలభైరవ క్షేత్రంలో ఆదివారం అష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ లత తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో కొలువైన శ్రీకాలభైరవ స్వామికి అభిషేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి అష్టమి రోజున భారీగా భక్తులు నేతి దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొనడం ఆనవాయితీ.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'సురక్షిత గ్రామం' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని తెలిపారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై చిత్రాలను వేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రస్ట్ ప్రతినిధి దేవేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నై డాక్టర్లతో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నాగలాపురం: మండలంలోని వెస్టు దళితవాడలో శనివారం ఉదయం సర్పంచ్ చిన్నదొరై, ఎంపీపీ సింధు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నాలుగు రోజులుగా వర్షాలు వల్ల వాతావరణ మార్పులతో గ్రామ ప్రజలు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారని గుర్తించి, చెన్నై ఎంఎస్ హాస్పిటల్, నాగలాపురం సీఎం దంత వైద్యశాల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సుగునేష్, చైత్రమాలి, నివీన్, క్యాంప్ మేనేజర్ నవీన పాల్గొన్నారు.

వేడుకగా ఆయుధ పూజ


టీటీడీ ముద్రణాలయంలో ఆయుధ పూజ

తిరుపతి కల్చరల్: టీటీడీ రవాణా విభాగంలో శనివారం ఆయుధపూజను వేడుకగా నిర్వహించారు. టీటీడీ జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారికి ఆ విభాగాధిపతి శేషారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. జీఎం శేషారెడ్డి జేఈవోలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌వో వీర్రాజు, వీజీవో బాలిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ డీఎం లక్ష్మీప్రసన్న, డీఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీటీడీ పరిపాలన భవనం ఎదురుగానున్న ముద్రణాలయంలోనూ ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీవారికి పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ యంత్రాలకు పూజలు చేశారు. ఇక్కడ ఉన్న డీటీపీ, ఆఫ్‌సెట్, మెషిన్ సెక్షన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకు ఆయుధపూజ చేశారు.

తిరుచ్చిపై అభయం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా వెలసిన సీతారాములు శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు. అనంతరం శ్రీరాముల వారు సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

కాలిబాటలతో అధిక దిగుబడులు

- చీడపీడల ఉధృతి తగ్గుతుందంటున్న అధికారులు
- సత్యవేడు డివిజన్‌లో రబీలో 14 వేల హెక్టార్లల్లో వరి సాగు




వరదయ్యపాళెం సీఎల్ఎన్‌పల్లె పంట పొలాల్లో కాలిబాటలతో వరి సాగు

రైతులు విత్తనం నాటే రోజు నుంచి పంట చేతికొచ్చే వరకూ మెలకువలు పాటిస్తే అనుకున్న స్థాయిలో పంట దిగుబడిని పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వరి పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వల్ల తెగుళ్ల సోకే అవకాశం ఎక్కువగా ఉంది. దీని నివారణకు నాట్ల సమయంలో కాలిబాటలు వేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని వరదయ్యపాళెం మండల వ్యవసాయశాఖ అధికారి సుహర్‌లత వివరించారు. సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో 14వేల హెక్టార్లలో వరిసాగు చేయనున్నారు. ఈ సందర్భంగా ఏవో సస్యరక్షణలు చర్యలు వివరించారు.

వరదయ్యపాళెం: సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలోని వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో రబీ సీజన్‌లో 14వేల హెక్టార్లలో వరి సాగు చేస్తారు. ఒకప్పుడు వరినాట్లు ఎలా పడితే అలా వేసేవారు. కాలక్రమేణా రైతుల్లో అవగాహన పెరగడంతో కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వరినాట్లు వేసే విధానం, కాలిబాటల వల్ల ఉపయోగం తదితర విషయాలను ఏడీఏ వివరించారు. 'వరి కుదుళ్లను దుబ్బులుగా నాటొద్దు. దీని వల్ల పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పంటకు చీడలు, పీడలు తొందరగా ఆశిస్తాయి. ప్రతి రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి తెగుళ్ల ఉధృతి నుంచి కాపాడుకోవచ్చు. భూసారం ఎక్కువగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, తక్కువగా ఉన్న పొలాల్లో ఎక్కువ కుదుళ్లు ఉండేలా నాటాలి. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లు సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా దుబ్బులుగా నాటిన పంట పొలాల్లో ఎక్కువగా సుడిదోమ ఆశిస్తుంది' అని సూచించారు.

ఉపయోగాలెన్నో ..

కాలిబాటలతో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది. ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది. కలుపును సులభంగా నియంత్రించవచ్చు. కిరణజన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కల్లో పత్రహరితం ఎక్కువగా ఉత్పత్తి కావడంతో పంట దిగుబడి పెరుగుతుంది. ఎలుకలను సమర్థవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టేందుకు అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా పంట పొలాల్లో తెగుళ్ల ఉధృతిని పరిశీలించేందుకు కాలిబాటలు దోహదపడతాయి.

విజేతలకు అభినందనలు


బహుమతులందుకున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రోటరీక్లబ్ వారు గోల్డెన్ జూబ్లీ పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ది స్కూల్‌కు చెందిన విద్యార్థులు పలు విభాగాల్లో విజేతలు నిలిచారు. వారిని శనివారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ జనార్దన్‌రావ్ జే పవార్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనంలో గ్రీష్మ, హర్షశ్రీ, నృత్యంలో లోహితారెడ్డి, వెన్నెల, రంగోలిలో జాహ్నవి, సంగీత విభాగంలో విమలేష్‌రెడ్డి, ఉపన్యాసంలో కేతన్ విజేతలుగా నిలిచారన్నారు. హెచ్ఎం విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగకాలనీ ఏపీ బాలికల గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో శనివారం రక్షణ చట్టాలపై 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన చట్టం, సమాచార హక్కు చట్టం, లీగల్ సర్వీసెస్, ర్యాగింగ్ తదితర చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనవచ్చని తెలిపారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100ను సంప్రదించాలని సూచించారు. న్యాయవాదులు మల్లికార్జునయ్య, రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న తిరుమలయ్య

ఏర్పేడు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు కావేరి తిరుమలయ్య అన్నారు. శనివారం మండలంలోని కొత్తవీరాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎలాంటి ఖర్చులేకుండా మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 345 మంది రోగులను పరీక్షించి మందుల కిట్లు అందజేశారు. బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జనార్దన్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చెంగల్‌రాయులు, సురేఖ, మురగయ్య, రామదాసు, కృష్ణారెడ్డి, ప్రభు, గురవారెడ్డి, దామోదరంరెడ్డి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పట్టణానికి చెందిన ఎంజీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. డింపు శివాని మూడవ స్థానం సాధించింది. హర్షవర్ధన్ కూడా ప్రతిభ చూపాడు. వీరిని పాఠశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 1నుంచి 3వ తేదీ వరకు రాష్ట్ర పోటీలు భీమవరంలో జరిగాయన్నారు. యోగా ఉపాధ్యాయురాలు సుజాత, హెచ్ఎం పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ


నాగలాపురం: ఊంజల్ సేవలో సేద తీరుతున్న స్వామి, అమ్మవార్లు


నారాయణవనం : ఊంజల్ సేవలో విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రసిద్ధ శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం అనంతరం శ్రీస్వామి, అమ్మ వార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు. ఆలయ టీటీడీ అధి కారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉంజల్‌సేవ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవిసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి ప్రాకారోత్సవం అనంతరం ఊంజల్ మండపంలో ఊయలపై కొలువుదీర్చి ఊయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ అధికారులు నాగరాజు, భరత్, జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

మెకానిక్ కుటుంబానికి సాయం


సాయం చేస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆటోనగర్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ సభ్యుడు, ట్రాక్టర్ మెకానిక్ మీర్జావలి శనివారం మరణించారు. అధ్యక్షుడు గోపీనాయుడు ఆధ్వర్యంలో ఆయన కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. సభ్యులు మోహన్, మునిగోపాల్, సాదిక్‌బేగ్, సుబ్రహ్మణ్యం, తిరుపాల్‌రెడ్డి, మీర్జాన్‌బేగ్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి




సత్యవేడు : కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జరీనా, పిచ్చాటూరు: సూచనలిస్తున్న తహసీల్దార్

సత్యవేడు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ జరీనా అన్నారు. శనివారం కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారం, సత్యవేడు పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదును ఆమె పరిశీలించారు. ఆదివారం నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓ ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావచ్చని పేర్కొన్నారు.

పిచ్చాటూరులో 30 దరఖాస్తులు


పెద్ద పాండూరు కేంద్రం తనిఖీ

పిచ్చాటూరు: రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు శనివారం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక డ్రైవ్‌లో 30 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు మధుసూదన్ రావు తెలిపారు. శనివారం సాయంత్రం తహసీల్దారు మాట్లాడుతూ శనివారం, సోమవారం ఓటర్ల జాబితాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. తాను మండలంలోని పిచ్చాటూరు, కీళపూడి, వేలూరు, వెంగళత్తూరు పోలింగ్ బూత్‌ల పరిధిలో పర్యటించి పరిశీలించానన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు మండలంలోని అన్నీ బూత్‌లను పరిశీలించినట్లు తెలిపారు. తొలిరోజు డ్రైవ్‌లో కొత్త ఓటర్ల నమోదుకు 18, తొలగింపు (మరణించినవారు)నకు 3, సవరణలకు సంబంధించి 9 దరఖాస్తులు అందినట్లు ఆయన వివరించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వరదయ్యపాళెం: మండలంలోని 29 పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ గౌరీశంకరరావు, డిప్యూటీ తహసీల్దార్ శాంతి శనివారం వేర్వేరుగా ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల నమోదు నిష్పక్షపాతంగా జరగాలని, అర్హత కలిగిన వారందరినీ ఓటరుగా నమోదు చేయడంలో బీఎల్ఓలు, వీఆర్వోల సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

జీవ వైవిధ్యంతోనే మనుగడ


మాట్లాడుతున్న సుమన్

ఏర్పేడు: మానవ మనుగడకు జీవవైవిధ్యం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి ప్రతినిధి సుమన్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలన్నారు. అడవులను పరిరక్షించాలని సూచించారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మర్థాల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవార్డుల ప్రదానం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ధరణి అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిర్వహించిన అబాకస్ శిక్షణలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో అవార్డులు అందజేయనున్నారు. ఈ మేరకు అబాకస్ సంస్థ డైరెక్టర్ ఎం.రవికుమార్ శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏఎస్పీ విమలకుమారి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, జాతీయ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ చేతుల మీదుగా ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్..


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాత్రికేయులు

వరదయ్యపాళెం: జర్నలిస్టుల జీవితాల్లో వెలుగులు నింపేలా ఇళ్ల స్థలాల పంపిణీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మంత్రి మండలి ఆమోదం తెలపడం శుభపరిమాణమని వరదయ్యపాళెం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సామర్ల హరి, గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలియజేస్తూ శనివారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాత్రికేయులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకమని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు సురేష్, ఉమామహేశ్వర్, డిల్లీప్ రాయల్, మహేష్, ఇళయరాజా, నాగార్జున, కిషోర్, ఎలియేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో ఇంకుడు గుంతల తవ్వకం

నారాయణవనం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏపీవో సుకన్య తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జల మట్టాన్నిపెంచడంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఇంకుడు గుంతల నిర్మించాలని సర్పంచ్‌లకు సూచించామని అన్నారు. ఈపనులకు ప్రభుత్వమే పూర్తి నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. ఇళ్ల వద్ద కూడా గుంతలను నిర్మించుకోవచ్చునని అన్నారు. వ్యక్తిగతంగా కాకుండా మూడు లేదా నాలుగు కుటుంబాలు కలిసి సమూహంగా తమ ఇళ్ల దాబాల నుంచి వర్షపు నీటిని ఒకే ఇంకుడు గుంతలో నిల్వ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమూహ ఇంకుడు గుంత నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద గరిష్టంగా రూ.18 వేలు మంజూరు చేస్తారని తెలిపారు. ఆధార్ కార్డులతో మండల ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదిస్తే అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్స్‌లు తప్పనిసరి


ఏర్పేడు: సూచనలిస్తున్న డీఎస్పీ భవ్యశ్రీ

ఏర్పేడు: దీపావళి పర్వదినం సందర్భంగా లైసెన్స్‌లు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు తప్పవని రేణిగుంట డీఎస్పీ భవ్యశ్రీ అన్నారు. శనివారం మండలంలోని ఏర్పేడు, సీతారాంపేట, పాపానాయుడుపేట, పల్లంపేటలోని టపాకాయల దుకాణాలను ఆమె పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ దుకాణాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత స్టాక్‌ను విక్రయించకూడదని తెలిపారు. ఏర్పేడు సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి


శివకుమార్ రెడ్డి, సీఐ

సత్యవేడు: దీపావళి పర్వదినం సందర్భంగా లైసెన్స్ పొందిన వ్యాపారులు నిబంధనల మేరకే టపాసుల విక్రయాలు జరపాలని సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులు నిర్దేశించిన స్థలాల్లోనే టపాసులు విక్రయించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాల్లో టపాసులు నిల్వ ఉంచకూడదని తెలిపారు. ఫైర్ సేఫ్టీ మార్గదర్శకాలు పాటించాలన్నారు. లైసెన్స్‌లు లేని వారు విక్రయాలు చేపడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరమవుతాయని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తేజశ్వని సూచించారు. శనివారం మండలంలోని ఈదులగుంట సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వర పీడితులకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, వేడినీరు తాగడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని తెలియజేశారు. అనంతరం కాలనీలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు. ఏఎన్ఎం సుధ, ఎంఎల్‌హెచ్‌పీ భారతి పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లత

శ్రీకాళహస్తి: విద్యార్థులు కళాశాలలో సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రిన్సిపల్ లత తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలకడం అనేది మంచి వాతావరణాన్ని పెంపొందిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు నరసింహవర్మ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అన్ని రంగాల్లో రాణించాలి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని దిగువ సాంబయ్య పాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం అన్నారు. శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏకపాత్రా భినయం, అభిగేయాలు, పద్య పఠనం, చిత్రం లేఖనం, మంచి స్పర్శ–చెడు స్పర్శపై అవగాహన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆట,పాటలతో విద్యార్థులు అలరించారు.